తల్లికి వందనం ఏమైంది



ప్రభుత్వ పాఠశాలలో నా పిల్లలు ఇద్దరూ చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం కింద రూ. 15 వేలు ఇస్తామన్నారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే ప్రభుత్వం ఇవ్వాలి. ఇప్పుడు కాదు, వచ్చే ఏడాది నుంచి అని మాట మార్చారు. గతంలో జగనన్న పాలనలో ప్రకటించిన సమయానికే సొమ్ము జమ చేశారు. అయితే చంద్రబాబు ఇప్పటి వరకు సొమ్ము ఇవ్వలేదు.

– పి.లక్ష్మి, కానూరు, పెనమలూరు మండలం

సాగుకు పెట్టుబడి సాయం అందలేదు



టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తామని చెప్పిన హామీని ఎంతో విశ్వసించాం. ఖరీఫ్ చివరి దశలో ఉంది. కానీ రైతు భరోసా ఎప్పుడు అమలు చేస్తారో ఇప్పటి వరకూ ప్రకటించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా సమయానికి అందించారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఇంకా అందకపోవడంతో రైతాంగం ఎదురుచూస్తున్నాం.

– కసుకుర్తి శ్రీనివాసరావు, రంగన్నగూడెం, బాపులపాడు మండలం.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి. ఉద్యోగాలు వచ్చే వరకు ప్రభుత్వం నిరుద్యోగులను ఆదుకోవాలి. అలాగే ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించాలి. ప్రభుత్వం ఇప్పటి వరకు దాని గురించి ప్రస్తావన చేయడం లేదు.

– షేక్.నాయబ్ రసూల్, సనత్‌నగర్, కానూరు.

తల్లికి వందనం కోసం ఎదురుచూస్తున్నాం



టీడీపీ కూటమి సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం అమలు చేస్తామని ప్రచారంలో చెప్పారు. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై సుమారు 3 నెలలు దాటింది. ఇప్పటి వరకూ తల్లికి వందనం రాకపోవడంతో ఎదురు చూస్తున్నాం. ఇచ్చిన హామీ ప్రకారం ఈ పథకాన్ని అమలు పరచాలి.

– రాచమళ్ల రత్నకుమారి, ఎనికేపాడు

ప్రతి మహిళకు రూ.1,500 ఊసే లేదు



ఎన్నికల ప్రచారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కానీ ఇంత వరకు మహిళలకు వాగ్దానం చేసిన ఏ పథకం కూడా అమలు జరగలేదు. పథకాలను త్వరగా అమలు చేయాలి. త్వరితగతిన నెలకి రూ. 1,500 అందజేయాలి.


– దేవరపల్లి చాందిని, అంబాపురం

సాధ్యం కాదు అంటే ఎలా.?



సూపర్ సిక్స్ అనగానే అందరూ నమ్మేశారు. పథకాలతో మేలు జరుగుతుందని భావించి కూటమికి అధికారం ఇచ్చాం. ఇప్పుడు కూటమి రోజుకో కొత్త కథ చెబుతోంది. రైతులకు భరోసా ఇవ్వలేదు. తల్లికి వందనం వచ్చే ఏడాది అంటున్నారు. మహిళకు నెలకు రూ. 1,500 ఎప్పుడో ప్రకటన లేదు. సూపర్ సిక్స్ పథకాలు తక్షణమే అమలు చేయాలి.

– వల్లె రాజు, ప్రొద్దుటూరు, కంకిపాడు మండలం



సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

కంకిపాడు/గన్నవరం: సూపర్ సిక్స్ హామీలను కూటమి ఊదరగొట్టింది. సంక్షేమం పేరుతో ప్రజల్ని వంచించింది. గతంలో ఎన్నడూ లేని సంక్షేమాన్ని చూపిస్తామంటూ నమ్మబలికింది. కూటమికి ప్రజలు పట్టం గడితే హామీలను నెరవేర్చలేమంటూ మొఖం చాటేస్తోంది. సూపర్ సిక్స్ అంటేనే భయం వేస్తుందంటూ ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలతో సూపర్ సిక్స్ అంతా మోసమేనా? అన్న భావన ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. తాజాగా చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రజల ఆందోళనకు మరింత బలం చేకూరుస్తున్నాయి. పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, ఉయ్యూరు నగర పంచాయతీ, తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో సుమారు 4.25 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. 2,94,928 మంది ఓటర్లు ఉన్నారు. కూటమి ఇచ్చిన హామీలను నమ్మి పట్టం గట్టి నేడు లబోదిబో మనడం ప్రజలవంతైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు అన్నీ అమలు అయ్యాయి. షెడ్యూల్ ప్రకారం పథకాలను అమలు చేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇచ్చిన హామీలను నూరుశాతం నెరవేర్చే దిశగా జగన్ సర్కారు పనిచేసింది. కూటమి మాత్రం ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మహిళలకు రూ. 1,500, ఎందరు ఉంటే అందరికీ తల్లికి వందనం అంటూ అనేక హామీలతో ప్రజల్ని వంచిందింటూ ప్రజాస్వామ్యవాదులు వ్యాఖ్యలు చేస్తున్నారు. కూటమి వ్యవహార శైలిని తప్పుపడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో అమ్మ ఒడి కింద ఐదేళ్లలో 63,153 మందికి రూ. 204.57 కోట్లు లబ్ధిచేకూరింది. రైతుభరోసా కింద 23,238 మందికి రూ. 102.96 కోట్లు మేలు జరిగింది. వివిధ సంక్షేమ పథకాల కింద 4,35,707 మందికి ఐదేళ్లలో రూ. 1,190.27 కోట్లు ప్రత్యక్షంగానూ, పరోక్షంగా 1,41,934 మందికి రూ. 600.30 కోట్లు లబ్ధిచేకూరింది.

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
గన్నవరం	1,22,816 మంది
అందాల్సిన సాయం	18.42 కోట్లు
పెనమలూరు	1,32,030 మంది
అందాల్సిన సాయం	19.80 కోట్లు

రూ.30 వేలు వస్తాయని ఎదురుచూస్తున్నా



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మఒడి పథకం పేరును తల్లికి వందనంగా మార్పు చేశారు. నా ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. రూ. 30 వేలు వస్తాయని ఆశతో ఎదురు చూస్తున్నా. ఇంత వరకు ఆ సాయం అందలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా స్కూల్స్ పునఃప్రారంభానికి ముందే విద్యార్థుల తల్లుల ఖాతాలో అమ్మ ఒడి పథకం డబ్బులు జమచేశారు.

– కొండవీటి ప్రవళ్లిక, అంబాపురం

ఆరు పథకాల అమలెప్పుడూ ?




ఉద్యోగాలు లేని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగభృతి అమలు చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికో ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగం కల్పించే వరకు నిరుద్యోగులకు నెలకు మూడువేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన ప్రకారం నిరుద్యోగభృతి త్వరగా ఇవ్వాలి. ఆరు పథకాలు ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలియజేయాలి.

– కలకోటి శ్రీనివాసరెడ్డి, నున్న గ్రామం


జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	గన్నవరం	33.21
	పెనమలూరు	20.59



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు	
గన్నవరం	32,561 మంది
అందాల్సిన సాయం	65.12 కోట్లు
పెనమలూరు	23,238 మంది
అందాల్సిన సాయం	46.47 కోట్లు



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
గన్నవరం	92,837 మంది
అందాల్సిన సాయం	27.85 కోట్లు
పెనమలూరు	98,112 మంది
అందాల్సిన సాయం	29.43 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	గన్నవరం	28.15
	పెనమలూరు	40.91



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు	
గన్నవరం	43,046 మంది
అందాల్సిన సాయం	64.56 కోట్లు
పెనమలూరు	35,500 మంది
అందాల్సిన సాయం	53.25 కోట్లు

క్లుప్తంగా

జాతీయ స్థాయిలో ఎన్‌సీసీలో విద్యార్థుల సత్తా



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ విద్యార్థులు ఎన్‌సీసీలో జాతీయ స్థాయిలో రెండో స్థానం పొందారు. వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు బుధవారం వివరాలు తెలుపుతూ ఆల్ ఇండియా థల్‌సైనిక్ క్యాంపులో తమ కాలేజీకి చెందిన ఎన్‌సీసీ కేడెట్లు బి.భార్గవిరాతోడ్ ఇంటర్ గ్రూప్ జూనియర్ అండర్ ఆఫీసర్ విభాగం పోటీలో ఫీల్డ్ సిగ్నెల్, జడ్జింగ్ డిస్టెన్స్ గోల్డ్ మెడల్, సీనియర్ అండర్ ఆఫీసర్ విభాగంలో హెల్త్ అండ్ హైజినీలో అబ్దుల్ ఇర్ఫాన్‌బేగ్ బ్రాంజ్‌మెడల్ సాధించారన్నారు. ఈ సందర్భంగా వారిని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎంఎస్‌వీడీ సుదర్శన్, అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యంపై హైకోర్టు జోక్యం చేసుకోవాలని వినతి

గన్నవరం: ఇటీవల కృష్ణానది, బుడమేరు వల్ల సంభవించిన వరద ముంపు సమయంలో ప్రజల భద్రతను నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఘోరమైన లోపాలపై హైకోర్టు తక్షణం జోక్యం చేసుకోవాలని బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కొర్రపోలు శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్‌కు ఆయన లేఖ రాశారు. ఈ మేరకు బుధవారం ఆయన లేఖలోని వివరాలను మీడియాకు వెల్లడించారు. వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కనీసం ముందస్తు హెచ్చరికలు కూడా ఇవ్వలేదన్నారు. దీని వల్ల ప్రజలు తమను తాము రక్షించుకోలేని అవకాశం లేకుండా పోయిందన్నారు. ప్రజలకు కలిగిన ఈ నష్టంపై ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించి హైకోర్టు జోక్యం చేసుకోవాలని ప్రధాన న్యాయమూర్తిని కోరినట్లు తెలిపారు.

వైభవంగా గణనాథుడి ఊరేగింపు

కంకిపాడు: గణేష్ నిమజ్జన ఊరేగింపు మహోత్సవం వైభవంగా సాగింది. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో పాటిమీద సెంటరులో భక్త బృందం ఏర్పాటుచేసిన భారీ గణనాథుడికి నవరాత్రులు విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. ఉత్సవాలు ముగియటంతో డప్పు వాయిద్యాలతో బుధవారం స్వామివారి నిమజ్జనోత్సవం నిర్వహించారు.

■ **రైతుబజారు దుకాణదారులకు దళారుల హుకుం**

కంకిపాడు: టీడీపీకి చెందిన దళారీ వ్యాపారులు రైతుబజారుపై కన్నేశారు. తాడిగడపకు చెందిన వ్యాపారి నాగబాబు, పునాదిపాడుకు చెందిన మరో వ్యాపారి రాంబాబు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆశీస్సులతో కంకిపాడు, ఉయ్యూరు, నూతనంగా నిర్మించబోతున్న తాడిగడప(కానూరు) రైతుబజారుల్లో డ్వాక్రా, సొసైటీ నిర్వాహకులు కూరగాయలు వీరిద్దరి వద్దే కొనేలా మార్కెటింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ నెల 17న కంకిపాడు రైతుబజారు ఎస్టేట్ అధికారి చంద్రమోహన్ సమక్షంలోనే వ్యాపారులిద్దరూ దుకాణదారులను పిలిచి బేరం పెట్టారు. తాము ఇప్పటికే విజయవాడకు చెందిన వ్యాపారుల వద్ద తెస్తున్నామని, వారికి అప్పులు కూడా కట్టాలని, ఒక్కసారే సరుకు తేవటం మానేస్తే అప్పులు కట్టాలని ఒత్తిడి చేస్తే కట్టే పరిస్థితి లేదని వాపోయారు. అదేమీ తమకు తెలీదని, ఎమ్మెల్యే ఆఫీసు నుంచి కూడా చెప్పారని కచ్చితంగా కూరగాయలు కొనాల్సిందేనని దుకాణదారులకు హుకుం జారీ చేశారు. లేదంటే దుకాణాలు ఉండవని రోడ్డున పడతారని బెదిరింపులకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది. మూడు రోజుల క్రితం పోరంకిలోని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయానికి దుకాణదారులు వెళ్లి ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. వ్యాపారుల వద్ద కొనాల్సిందేనని ఎమ్మెల్యే తెగేసిచెప్పినట్లు సమాచారం. దీనిపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే ఆఫీసు నుంచి ఫోన్ రావడంతో దుకాణదారుల్ని పిలిపించి మాట్లాడించానని ఎస్టేట్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. షాపులు పోతాయని వ్యాపారి అనటం నిజమేనని ఒప్పుకున్నారు.


■ **అభయాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.14.36 లక్షలు**

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.14.36 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారి ఎ.సుజన్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు బుధవారం లెక్కించారు. గత 105 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని ఈవో శ్రీనివాస్ చెప్పారు.

■ **యనమలకుదురు ఆలయానికి రూ.25 వేల విరాళం**

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానానికి భక్తులు రూ.25 వేల విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు బుధవారం మాట్లాడుతూ కానూరుకు చెందిన లింగమనేని రమాదేవి కుటుంబ సభ్యులు స్వామివారికి రూ.25 వేల చెక్కును అందజేశారన్నారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు.

■ **గంగూరులో సినీ నటుల సందడి**



పెనమలూరు: గంగూరులో చిల్లీస్ రెస్టారెంట్‌ను సినీనటులు రఘుబాబు, గౌతమ్‌రాజులు బుధవారం ప్రారంభించారు. సినీనటులు గంగూరు రావటంతో సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే బోడెప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఆర్గనైజర్ పాతూరి నాగభూషణం, రెస్టారెంట్ యజమాని రాధాకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

■ **తాడిగడప అధికారుల వింత పోకడ**

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ అధికారుల పాలన ఒంటెద్దు పోకడగా మారింది. స్థానిక శ్రీనివాసానగర్ సమీపంలోని ఒక కాలనీలో రియల్టర్లు విచ్చలవిడిగా అనుమతులు లేకుండా గ్రూప్‌హౌస్‌లు నిర్మాణం చేసి సొమ్ము చేసుకున్నారు. కాలనీకి డ్రెయినేజీలను బిల్డర్లు నిర్మాణం చేయలేదు. కాగా కాలనీ కోసం తాడిగడప మున్సిపాలిటీ అధికారులు బుధవారం కాలువ కట్టపై నివసిస్తున్న ఇళ్ల మధ్యలో నుంచి డ్రెయినేజీ పనులు చేపట్టారు. దీంతో ఇళ్లకు పగుళ్లు వచ్చాయి. గత ప్రభుత్వం రూ 60 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును సైతం ధ్వంసం చేశారు. మురుగు నీరు నేరుగా బందరు కాలువలో కలపటానికి రంగం సిద్ధం చేశారు. సాగు, తాగునీరుకు ఉపయోగపడుతున్న బందరు కాలువ ఇప్పటికే ప్రమాదస్థితిలో ఉండగా కాలనీ మురుగు నీరు కాలువలో కలపటానికి మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. దీనిపై స్థానికులు నిరసన చేపట్టారు. కమిషనర్ వెంకటేశ్వరరావుకు బాధితులు వినతిపత్రం అందచేశారు.

సంక్షిప్త వార్తలు

■ **నూతన గిరిజన సంఘం ఏర్పాటు**



పెనమలూరు: ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్(ఈజీఎఫ్) రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటు చేశామని కమిటీ అధ్యక్షుడు కండెల ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు తెలుపుతూ పెనమలూరు కేంద్రంగా జరిగిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించామన్నారు. కమిటీలో ఉపాధ్యక్షుడిగా మొగిలి అద్దెయ్య, ప్రధాన కార్యదర్శి జగన్నాథం బాబూరావు, కార్యదర్శి పాలపర్తి శ్రీకాంత్, కోశాధికారి పూజారి భారతి, కార్యవర్గ సభ్యులుగా దేవర వెంకటేశ్వర్లు, దేవరకొండ నాగమణి, ఎన్నికయ్యారన్నారు. గిరిజనులకు, ఏకలవ్య వారసులకు అండగా ఉంటామన్నారు. కొందరు నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లతో సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు పొందుతున్నారని, ఆ అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తామని చెప్పారు.

■ **పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలి**



కంకిపాడు: పౌష్టికాహార లోపాలను అధిగమించాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ బేబి సుకన్య అన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కంకిపాడు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

■ **పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

గన్నవరం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య ప్రారంభించారు. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఎంపీటీసీ సభ్యులు శొంఠి కిషోర్, పంచాయతీరాజ్ ఏఈ దాసు, గన్నవరం పంచాయతీ కార్యదర్శి సీహెచ్, అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉయ్యూరు: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి స్వచ్ఛమైన సమాజంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు కోరారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. ఎంపీడీఓ విమాదేవి, ఎంఈఓ-2 సుధారాణి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి.హరిబాబు బుధవారం తెలిపారు. బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియా, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతం, గాంధీబొమ్మ సెంటర్, గొడపేట, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, చెంచులకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మట్టి అక్రమ రవాణా చేస్తున్న 8 మంది అరెస్ట్

ఉంగుటూరు: పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ఎనిమిది మందిని ఆత్కూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ చావా సురేష్ మాట్లాడుతూ.. తెంపల్లి గ్రామానికి చెందిన కొలుసు సాంబయ్య తన జేసీబీతో బల్లిపర్రు గ్రామ శివారులో మట్టి రవాణాకు పాల్పడుతున్నాడన్నారు. ఇరిగేషన్ ఏఈ కౌశిక్, వీఆర్వోలతో కలిసి ఆకస్మిక దాడి చేశామన్నారు. దాడిలో ఎనిమిది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని జేసీబీ, ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉషారామలో బూట్ క్యాంప్ ప్రారంభం



మాట్లాడుతున్న మస్తానయ్య

ఉంగుటూరు: అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్ అండ్ లిట్రసీ సంయుక్త ఆధ్వర్యంలో తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల బూట్ క్యాంప్‌ను పీఎం ఎస్‌హెచ్ఆర్ఐ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ వి.ఎస్.మస్తానయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆలోచనలకు పదును పెట్టడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌ను వేదికగా మార్చుకోవాలన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మూడు దశల్లో ఈ బూట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 జూలైలో జరిగే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో గెలుపొందిన విజేతలకు రూ.1.50 లక్షలు నగదు ప్రోత్సాహకం, వారి ఆవిష్కరణలకు పేటెంట్ హక్కులు కల్పించడంతో పాటు అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. రాష్ట్రంలోని 794 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ తరహాలో ఐడియా ల్యాబ్స్‌కు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐసీటీఈ మేనేజర్ డాక్టర్ ఐ.ఎన్.భీమ, ఏఐసీటీఈ ఫైనాన్స్ ఆఫీసర్ యోగేష్ వాద్వాన్, గౌరి గోపినాథ్, ఎస్ఐఈఎంఏటీ నోడల్ ఆఫీసర్ ప్రసాద్ రాజు, కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.